క్లుప్తంగా

అనారోగ్యంతో మాజీ జెడ్పీటీసీ మృతి



పరకాల : కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న పరకాల మాజీ జెడ్పీటీసీ సిలువేరు మొగిలి బుధవారం రాత్రి మృతిచెందాడు. ఆయన స్వగ్రామం వెంకటాపురం గ్రామానికి గురువారం ఉదయం మృతదేహాన్ని తరలించారు. విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో పాటు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు తరలివెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారుడిగా, ప్రజాప్రతినిధిగా మొగిలి నిస్వార్థంగా సేవలు అందించి మంచి పేరు తెచ్చుకున్నాడని పలువురు కొనియాడారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ధర్మసాగర్ : పురుగుల మందు తాగి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఓర్సు వెంకటమ్మ (65)కు కొన్ని సంవత్సరాల క్రితం వివాహం కాగా ఇరువురు విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి గ్రామంలోని కుటుంబ సభ్యులతో కలిసి ఉంటుంది. అయితే కొన్ని రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో కడుపునొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి పురుగులమందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

దామెర : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మణం చెందిన సంఘటన మండలంలోని ఒగ్లాపూర్ సైలానిబాబా దర్గా సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పరకాలలోని మాదారం కాలనీకి చెందిన పైండ్ల సూరయ్య(52) ఒగ్లాపూర్ సమీపంలోని ఓ పాఠశాలలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కుమార్తె ఇంటికి వెళ్లి వస్తూ బస్సు దిగిన సూరయ్య.. రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. స్థానికులు పోలీసులకు తెలుపగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్‌లు దర్యాప్తు ప్రారంభించారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

వేలేరు : మండలంలోని షోడాషపల్లి, మల్లికుదుర్ల గ్రామాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ జరిగిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... షోడాషపల్లి గ్రామానికి చెందిన గడ్డి రవి కుటుంబ సభ్యులతో కలిసి కోన్నేళ్లుగా తమిళనాడులో నివసిస్తున్నాడు. ఆయనకు స్వగ్రామమైన షోడాషపల్లిలో స్వంత ఇళ్లు ఉంది. నెలల తరబడి ఇంటికి తాళం వేసి ఉండగా అది గ్రహించిన దొంగలు ఇంటి తలుపులు ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం ఇంటి సమీపంలోని వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే షోడాషపల్లికి వచ్చిన పోలీసులు ఫింగర్ ప్రింట్ నిపుణులను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. అలాగే మల్లికుదుర్ల గ్రామానికి చెందిన ఎస్.రామలింగం కుటుంబ సభ్యులతో కలిసి హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. ఆయన ఇంటికి కూడా తాళం వేసి ఉండడంతో దొంగలు తాళం ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. చుట్టుపక్కలవారు రామలింగానికి సమాచారం ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్సై అజ్మీర సురేష్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన అనుముల నర్సిరెడ్డి తల్లి లసుమమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ లసుమమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

ఆర్థికసాయం

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మారేపల్లి ప్రమీల ఇటీవల గూడెప్పాడ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. ఆమె ఎస్‌ఎస్‌ఆర్ డెయిరీలో పనిచేస్తుండగా విషయం తెలుసుకున్న ఆ సంస్థల అధినేత నాయినేని సంపత్‌రావు బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. దహన సంస్కారాలకు రూ. 20వేల ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- డ్రైనేజీల నిర్మాణానికి కలుగని మోక్షం
- కంపుకొడుతున్న వీధులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



కామారంలో రోడ్డుపక్కనే నిలిచిన మురుగు నీరు

ఆత్మకూరు : మండలంలోని పలు గ్రామాల వీధులు పారిశుద్ధ్యం లోపించి కంపుకొడుతున్నాయి. కామారం, తిరుమలగిరితో పాటు వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించి డ్రైనేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. కొన్ని చోట్ల మురుగునీరు నిల్వ అవడంతో దోమలు చేరి ఆవాసాలు ఏర్పరుచుకున్నాయి. స్పెషల్ ఆఫీసర్లు మౌళిక సదుపాయాలు కల్పించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండలంలో ఇటీవల పలువురు విషజ్వరాల బారిన పడినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో డ్రైనేజీ నిర్వహణ, తాగునీటి సరఫరా, చెత్త తొలగింపు తదితర అంశాల్లో పర్యవేక్షణ కరువయ్యిందని దీంతో జనాలు రోగాల బారిన పడుతున్నారని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కామారం గ్రామంలో రెండేళ్ల క్రితం వేసిన సీసీ రోడ్డు మార్గంలో డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైనే నిల్వ ఉంటుందని ఇప్పటికైనా స్పెషల్ ఆఫీసర్లు గ్రామాల్లో కనీస వసతులను పరిశీలించి కావాల్సిన సౌకర్యాలను కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పచ్చదనం, పరిసరాల పరిశుభ్రతకు కృషి

- ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి



మొక్క నాటుతున్న విద్యార్థిని, తదితరులు

ఎల్కతుర్తి : పాఠశాల పరిసరాలు పచ్చదనంతో కళకళలాడుతూ పరిశుభ్రతతో ఉండేలా కృషి చేస్తున్నామని ప్రధానోపాధ్యాయురాలు పుల్లా ప్రభావతి తెలిపారు. గురువారం సామూహిక మొక్కల పెంపకం కార్యక్రమంలో భాగంగా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినులకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించే లక్ష్యంగా మొక్కలు నాటినామన్నారు. నాటిన మొక్కలకు ప్రతీ రోజు నీరుపోసి సంరక్షించాలని విద్యార్థినులకు సూచించారు. మొక్కలు నాటడం వల్ల అవి వృక్షాలుగా ఎదిగి వాతావరణ కాలుష్య నివారణకు దోహదపడుతాయన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

శాయంపేట : మండలంలోని మైలారం, జోగంపల్లి గ్రామాల్లో పత్తి, వరి, మొక్కజొన్న పంటలను తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం వరంగల్ శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. సీనియర్ శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.విజయభాస్కర్ మాట్లాడుతూ.. పత్తి పంటలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వడలు, తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్క మొదలు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. కాయ కుళ్లు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 30గ్రాములు, 1గ్రాము స్ట్రెప్టో సైక్లిన్ పది లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరానికి ఆరు నుంచి ఎనిమిది లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేయాలన్నారు. రసం పీల్చే పురుగుల నివారణకు వేపనూనె 155 పీపీఎమ్ ఎకరాకు లీటర్ మందు చొప్పున, అస్‌ఫేట్ ఎకరాకు 300 గ్రాములు చొప్పున, ఫునికామైడ్ 0.25 మిల్లీ లీటర్ చొప్పున 2లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయంలో మెలకువలు పాటించేందుకు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటరాజకుమార్, డాక్టర్ విశ్వతేజ, ఏఓ గంగాజమున, ఎఈఓ అన్వేష్ పాల్గొన్నారు.

ముల్కనూరులో ఉచిత వైద్యశిబిరం



ముల్కనూరులో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యధికారి డాక్టర్ ప్రదీప్‌రెడ్డి

ఎల్కతుర్తి : వర్షాకాలం దృష్ట్యా రోజురోజుకు జ్వరాల సంఖ్య పెరుగుతున్న కారణంగా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు బీసీ కాలనీలో గురువారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న వారందరికి మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై వైద్యధికారి డాక్టర్ ప్రదీప్‌రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కిటికీలకు, డోర్లకు జాలీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనం చేసేటప్పుడు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. వైద్యులు మౌనిక, సూపర్‌వైజర్ రాజయ్య, సిబ్బంది కళా, వనజ, స్వరూప, రాజు, ఆశ కార్యకర్తలు జ్యోతి, రజిని, అరుణ, అలేఖ్య పాల్గొన్నారు.

ఉత్తరప్రదేశ్ ప్రతినిధుల బృందం పర్యటన




ఐనవోలు: రాంనగర్‌లో పర్యటించిన ఉత్తరప్రదేశ్ ప్రతినిధుల బృందం

ఐనవోలు: మండలంలోని రాంనగర్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రతినిధుల బృందం గురువారం పర్యటించింది. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా అంగన్వాడీ, హెల్త్ సెంటర్, ఉపాధి హామీ పనులు, శానిటేషన్ కార్యక్రమాలు, విద్యా సౌకర్యాలు, వృద్ధాప్య, ఒంటరి మహిళా పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, తదితర ప్రభుత్వ పథకాల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సెంటర్ హెడ్ అనిల్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి డీపీఓ, ఎంపీఓ, సర్పంచ్‌లు 28 మంది కలిసి రాంనగర్ గ్రామాన్ని సందర్శించినట్లు ఎంపీడీఓ నర్మద తెలిపారు. ఎంపీఓ రఘుపతిరెడ్డి, ఏపీఓ నక్క కుమారస్వామి, ఏపీఎం సురేశ్, పంచాయతీ కార్యదర్శి రఘు తదితరులు పాల్గొన్నారు.

వేలేరు మండలంలో..

వేలేరు: మండలంలోని పీచర గ్రామాన్ని ఉత్తరప్రదేశ్ ఎక్స్‌పోజర్ టీం సభ్యులు గురువారం సందర్శించారు. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ హైదరాబాద్ (టీజీఐఆర్‌డీ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, వందశాతం వ్యాక్సినేషన్, షోషకాహార లోపం లేకుండా తీసుకుంటున్న చర్యల గురించి మండల స్థాయి అధికారులు బృందం సభ్యులకు వివరించారు. అలాగే, పలు పోటీల్లో విద్యార్థులు గెలుచుకున్న బహుమతులను చూపించారు. మహిళా శిశు, సంక్షేమ శాఖ జిల్లా అధికారి జయంతి, డీఎల్‌పీఓ గంగాభవాని, సీడీపీఓ విశ్వజ, తహసీల్దార్ హెచ్.కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎంఈఓ చంద్రమౌళి, డివిజనల్ ప్రోగాం మేనేజర్ వివేక్‌కుమార్ మిశ్రా, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ అధికారి సందుశరణ్, పంకజ్ మోహన్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం



కమలాపూర్ : హుజూరాబాద్-పరకాల రహదారిపై నిలిచిన వరద, మురుగు నీరు

కమలాపూర్ / పరకాల : కమలాపూర్ , పరకాల మండలాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో స్థానిక బస్టాండ్ ప్రాంతంతో పాటు పలు గ్రామాల్లోని కాలనీలు జలమయమయ్యాయి. హుజూరాబాద్-పరకాల ప్రధాన రహదారిపై వరద, మురుగు నీరు భారీగా చేరి వాగును తలపించింది. ఇళ్లు, షాపుల్లోకి వరద చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అరగంట పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

13న లోక్ అదాలత్

శాయంపేట : రాజీ మార్గంతో సమస్యలను పరిష్కరించుకోవాలని ఎస్సై జక్కుల పరమేశ్ సూచించారు. ఈనెల 13వ తేదీన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. భూ వివాదాలు, వాహన ప్రమాద పరిహార కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.

భవన నిర్మాణానికి ఆర్థికసాయం

ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం గ్రామంలో ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి నారాయణగిరి గ్రామానికి చెందిన ఎస్‌ఆర్‌వి వల్లపు రెడ్డి రామ్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. తన సహోదరి వల్లపురెడ్డి రజినీరెడ్డి స్మారకార్థం రూ.50,116 నగదును కమ్యూనిటీ హాలు నిర్మాణానికి అందించినట్లు రామ్‌రెడ్డి చెప్పారు. ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి సాయం అందించిన అతడికి ఆ సంఘం సభ్యులు శాలువాతో సత్కరించి అభినందించారు. ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు

కార్మికులకు చీరల పంపిణీ

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు, స్కావెంజర్లకు గురువారం హుజూరాబాద్‌కు చెందిన గండగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు గురువారం చీరలు పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్న 65మందికి అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సునీతారాణి హాజరై మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులు కష్టపడి విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారని అన్నారు. వారిని మరింత ప్రోత్సహించేందుకు చీరలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, వసంతరావు, శంకర్, సురేందర్, ప్రియదర్శిని పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ధర్మసాగర్ : జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా రూ.20,000 వేలు ఆర్థికసాయం పొందేందుకు మండలంలోని వితంతువులు దరఖాస్తు చేసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. వితంతువులు ధ్రువపత్రాలతో తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జనవరి 01, 2023 తర్వాత చనిపోయిన భర్త మరణ ధ్రువీకరణ పత్రం, భర్త వయస్సు 21 సంవత్సరాల నుంచి 60సంవత్సరాల్లోపు ఉండాలని, రేషన్ కార్డు జిరాక్స్, ఫ్యామిలీ మెంబెర్స్ సర్టిఫికెట్, ఆదాయం సర్టిఫికెట్, ఇరువురి ఆధార్ కార్డు జిరాక్స్‌లు వితంతువు బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లతో తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

యూరియా కోసం పాట్లు

శాయంపేట : మండల కేంద్రంలోని సాయి, భాస్కరా ఎరువుల దుకాణాల్లో ఉదయం నుంచి రైతులు పడిగాపులుగాసి యూరియాను కొనుగోలు చేశారు. ఈ క్రమంలో రైతుల నడుమ వాగ్వివాదం జరిగి తోపులాటకు దారితీసింది. ఎస్సై జక్కుల పరమేశ్ సిబ్బందితో అక్కడకు చేరుకుని రైతులను క్యూ పద్ధతిలో ఉంచి యూరియా పంపిణీని కొనసాగింపజేశారు. కాగా భాస్కరా ఎరువుల దుకాణంలో రైతులు రాత్రి వరకు వేసి యూరియా కొనుగోలు చేశారు. వర్షం కారణంగా పంపిణీ నిలిపివేశారు. దీంతో రైతులు వర్షంలో తడుస్తూ వెనుదిరిగారు.

జనవిజ్ఞాన వేదిక కమిటీ ఎన్నిక

శాయంపేట : మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఆవరణలో జనవిజ్ఞాన వేదిక మండల కమిటీని గురువారం శాయంపేట ఎంఈఓ గడ్డం భిక్షపతి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాల ఉపాధ్యాయురాలు సుజాత, కార్యదర్శిగా జెడ్పీహెచ్‌ఎస్ (బాయ్స్) ఉపాధ్యాయుడు ఎన్‌వీ.సత్యప్రసాద్, కోశాధికారిగా జెడ్పీహెచ్‌ఎస్ (మాందారిపేట) ఉపాధ్యాయురాలు కె.సంధ్య, కార్యనిర్వాహక సభ్యులుగా శాయంపేట జెడ్పీహెచ్‌ఎస్ (బాలికలు) ఉపాధ్యాయురాలు కె.రేణుక, ఉపాధ్యాయుడు రంజిత్‌కుమార్, ఎస్‌జీఓ ఓరుగల్లు లైఫ్ సొసైటీ సభ్యులు ఎమ్.సునీల్, గౌరవ సలహాదారుడిగా ఎంఈఓ భిక్షపతిని ఎన్నుకున్నారు.

జాతీయ మానవ హక్కుల సంఘం..

శాయంపేట : జాతీయ మానవ హక్కుల సంఘం మండల కమిటీని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య, జిల్లా అధ్యక్షుడు బండి సదానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన మహేష్ గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఏదుల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా రేణికుంట్ల పృథ్వీరాజ్ ఎన్నుకున్నారు. తమ ఎన్నికకు సహకరించిన సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎన్నికైౖ నవారికి నియామకపత్రాలు అందించారు.

కేజీకేఎస్ మండల కమిటీ ఎన్నిక

వేలేరు : తెలంగాణ కల్లుగీతా కార్మిక సంఘం బలోపేతానికే మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాంబయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా వీరన్న, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా రవీందర్, రాజు, గౌరవ అధ్యక్షుడిగా కనుకయ్య తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

కమలాపూర్ : గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు, ఇతర వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తుకు బానిసైన యువత గంజాయి సేవిస్తూ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి దొరకని పక్షంలో మెడికల్ షాపుల్లో మత్తు ఇంజక్షన్లు కొనుగోలు చేసుకుని వాటి ద్వారా నిషా, మత్తులో మునిగి పోతున్నారన్నారు. డ్రగ్స్, గంజాయి యువతతో పాటు వారి కుటుంబాన్ని కూడా సర్వనాశనం చేస్తుందన్నారు. ఎవరైనా గంజాయి సేవిస్తున్నట్లు, విక్రయిస్తున్నట్లు తెలిసినా, ప్రిస్కిప్షన్ లేకుండా మత్తు ఇంజక్షన్లు కొనుగోలు చేసినా, విక్రయించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సెల్ ఫోన్‌లో వచ్చే ఆడియో, వీడియో కాల్స్, ఇతర యాప్స్‌ను నమ్మొద్దని, లోన్ యాప్స్‌లో లోన్లు తీసుకోవద్దని సూచించారు. అపరిచితులకు ఓటీపీ, బ్యాంక్ ఖాతా వివరాలు చెప్పొద్దని, సైబర్ మోసాలకు గురై మోసపోవద్దని అన్నారు. మహిళలు, ఆడ పిల్లలు సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు అప్లోడ్ చేయొద్దని, కొందరు అపరిచితులు వాటిని మార్ఫింగ్ చేసే ప్రమాదం ఉందన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడొద్దని అన్నారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ గుండె బాబు, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎస్సైలు వీరభద్రరావు, మధు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- యూరియా అందించలేని అసమర్థ ప్రభుత్వమని విమర్శ
- ఎమ్మెల్యే పీఏ కాంట్రాక్టర్లను వేధిస్తున్నాడని ఆరోపణ



మాట్లాడుతున్న ధర్మారెడ్డి

పరకాల : యూరియా కోసం అరిగోస పడుతున్న రైతుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శాపనార్థం పెట్టారు. ముఖ్యమంత్రి పదవిలో రేవంత్‌రెడ్డి మరో ఆరునెలలు కూడా కొనసాగే పరిస్థితి కనిపించడం లేదని, రైతుల ఆగ్రహానికి ముళ్లేమూటా సర్దుకుని పారిపోయే సమయం వచ్చిందని తీవ్రస్థాయిలో విమర్శించారు. పట్టణంలోని ఎఫ్‌జే గార్డెన్‌లో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ అసమర్థత వలనే నేడు రైతులు యూరియా కోసం పగలు, రాత్రి తేడా లేకుండా క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందస్తు ప్రణాళికతో కేంద్రంతో కొట్లాడి మే, జూన్ మాసాల్లోనే యూరియాను రాష్ట్రానికి దిగుమతి చేసుకునేవారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థత కారణంగా రైతులు అరిగోస పడాల్సిన పరిస్థితి చూస్తున్నామన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళనలు చేపడుతుంటే బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులే రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రైతుల ఆందోళనపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. అదే విధంగా ఎమ్మెల్యే పీఏ కాంట్రాక్టర్లను టార్గెట్ చేస్తూ కమీషన్‌ల కోసం ఇబ్బందులు పెడుతున్నాడని ఆరోపించారు. పరకాల, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్లు బండి సారంగపాణి, కాంతాల కేశవరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, నాగిరెడ్డి, కుమారస్వామి, రవీందర్, రాము, జాకీర్‌అలీ, ధర్మారాజు, ఆత్మకూరు మాజీ సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఐరన్ రిచ్ ఫుడ్ తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఎంసీ కల్యాణి

ధర్మసాగర్ : విద్యార్థినుల్లో ఐరన్ లోపం ఎక్కువగా ఉంటుందని, రక్తహీనత లేకుండా ఐరన్ రిచ్ ఫుడ్ తీసుకోవాలని డీఎంసీ కల్యాణి సూచించారు. మండలంలోని ముప్పారం శివారులో గల కేజీబీవీలో గురువారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం చేపట్టిన అడాలసెంట్ గర్ల్స్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ అవేర్నెస్ కార్యక్రమం గురువారం కొనసాగింది. అందులో భాగంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం డీఎంసీ కల్యాణి మాట్లాడుతూ.. మహిళా సాధికారత కేంద్రం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అందించే పథకాలపై 10 రోజుల ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యం, పోషణ, పౌష్టికాహారం తీసుకోవడం వలన శారీర ఎదుగుదల, వ్యాధినిరోధక శక్తి పెంపొందుతున్నారు. అనంతరం కేజీబీవీ ప్రిన్సిపాల్ మాధవి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, విద్యార్థులకు తగిన జాగ్రత్తలు చెప్పారు. కేజీబీవీ సిబ్బంది, డీహెచ్‌ఈడబ్ల్యూ స్టాఫ్ మానస, లావణ్య పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- సంఘమిత్ర వలంటరీ ఆర్గనైజేషన్ కో ఆర్డినేటర్ సునీల్



మాట్లాడుతున్న సునీల్

కమలాపూర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలను స్వచ్ఛంద సంస్థల సహకారంతో మహిళలు వినియోగించుకుని ఆర్థిక, సామాజికాభివృద్ధి సాధించాలని సంఘమిత్ర వలంటరీ ఆర్గనైజేషన్ కో ఆర్డినేటర్ సుంకరి సునీల్ కోరారు. మండలంలోని మాదన్నపేటలో గురువారం సంఘమిత్ర వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి పథకాలు, వానపాములతో ఎరువుల తయారీ, పుట్ట గొడుగుల పెంపకం, తేనె పట్టు, కంప్యూటర్, టైలరింగ్ శిక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మోరె రంజిత్‌కుమార్, ప్రతినిధి రెడ్డి నాగరాజు, డీఆర్‌పీఏ సీసీ జ్యోతి, వీఓ అధ్యక్షురాలు బండి సోని, సీఏలు రమ, రజిత, మహిళా సంఘాల సభ్యులు రజిత, మనీల, విజయ, అఖిల, ప్రవళిక, కల్యాణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఆత్మకూరు : విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని గూడెప్పాడ్‌లో గల ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి కిచెన్ పరిసరాలను పరిశీలించారు. వంట సామగ్రిని, సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

వర్గ విభేదాలు అవాస్తవం

పరకాల : స్థానిక సంస్థల బీఫామ్ కేటాయింపుల విషయంలో కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గంలో వర్గ విభేదాలు అంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిని చూసి కొందరికి కళ్లు మండి అసత్య ప్రచారాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు.

వ్యాపారులపై చర్య తీసుకోవాలి

పరకాల : పట్టణంలోని వ్యాపారస్తులు యూరియాను అధిక ధరలకు విక్రయించకుండా వ్యవసాయ శాఖ అధికారులు చర్య తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ డిమాండ్ చేశారు. ఏఓ శ్రీనివాస్‌ను కలిసి యూరియా కొరతపై మాట్లాడారు.